సాక్షి రాజన్న సిరిసిల్ల

బుధవారం । 3 । జూలై । 2024



ఆసియా క్రీడల్లో యోగా

మినీ ఒలింపిక్స్ మాదిరిగా ఆసియా దేశాల్లో నిర్వహించే ఏషియన్ గేమ్స్‌లో మన దేశ సంస్కృతికి ప్రతీకైన యోగాకు చోటు దక్కింది. 8లో▸



ఎమ్మెల్యే సత్యంకు పరామర్శ

సిరిసిల్ల: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి ఇటీవల మృతిచెందగా, మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పరామర్శించారు.

గరిష్టం/కనిష్టం
34.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అంగన్‌వాడీ టీచర్ల సేవలు మరువలేనివి



అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, సీడీపీవో ఆలేఖ్య

ముస్తాబాద్(సిరిసిల్ల): నలభై ఏళ్లు సుదీర్ఘ కాలంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఎన్నో సేవలు అందించారని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం అన్నారు. ముస్తాబాద్, బందనకల్ టీచర్లు భారతీ, తులసీబాయి, విమల, నలుగురు ఆయాల ఉద్యోగ విరమణ సన్మానం మంగళవారం ముస్తాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమగ్ర శిశు సంరక్షణ పథకంలో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు ప్రభుత్వ పథకాలను, మారుమూల గ్రామాల్లో ఉత్తమ సేవలు అందించారన్నారు. ఉద్యోగ విరమణ చేసిన టీచర్లు, ఆయాలను సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో సీడీపీవో ఆలేఖ్య, సూపర్‌వైజర్ అరవింద, ఉపాధ్యాయ సంఘం నాయకుడు వి.చంద్రం, తాటిపాముల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పాన్‌షాపుల్లో పోలీసుల తనిఖీలు



నార్కోటిక్ డాగ్‌తో పాన్‌షాప్‌ల వద్ద తనిఖీ చేయిస్తున్న టౌన్ సీఐ వీరప్రసాద్

వేములవాడ: మత్తుపదార్థాల సేవనంపై పోలీసులు కొరఢా ఝులిపిస్తున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు టౌన్ సీఐ వీరప్రసాద్ ఆధ్వర్యంలో నార్కోటిక్ డాగ్‌తో పట్టణంలోని పాన్‌షాప్‌ల వద్ద మంగళవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గంజాయి వాడకంతో యువత ఆరోగ్యాలు పూర్తిగా ఛిన్నాభిన్నం అవుతున్నట్లు భావిస్తున్న పోలీసుశాఖ దాని నిర్మూలనకు పకడ్బందీగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా నార్కోటిక్ ప్రాక్టీస్ చేయించిన డాగ్ సహాయంతో గంజాయిలాంటి మత్తు పదార్థాలు ఉన్న ప్రాంతాలను గుర్తించే అవకాశాలున్నట్లు సీఐ తెలిపారు. పట్టణంలోని పాన్‌షాపుల్లో తనిఖీలు నిర్వహించామని పేర్కొన్నారు. ఎక్కడైనా గంజాయి విక్రయించినా, కొనుగోలు చేసినా తమకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలపై దృష్టిపెట్టాలని కోరారు.

మహిళా ప్రయాణికులకు లక్కీ డ్రా బహుమతులు

వేములవాడఅర్బన్: వేములవాడ నుంచి హైదరాబాద్ జేబీఎస్‌కు డీలక్స్ బస్సుల్లో వెళ్లే మహిళ ప్రయాకులకు లక్కీ డ్రా ద్వారా బహుమతులు అందించనున్నట్లు డిపో మేనేజర్ మురళీకృష్ణ తెలిపారు. మహిళలు తాము ప్రయాణించిన టి కెట్ వెనక పేరు, సెల్ నంబర్ రాసి బస్సు డ్రై వర్ వెనకాల ఉన్న లక్కీడీప్ డ్రా బాక్స్‌లో వే యాలన్నారు. లక్కీ డీప్ డ్రా బాక్స్‌లను ప్రతి 15 రోజులకు ఒకసారి తీసి ప్రథమ, ద్వితీయ, తృతీ య బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు.

సీనియర్ సిటిజన్లకు ఉచిత వైద్య పరీక్షలు

సిరిసిల్లకల్చరల్: జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రముఖ వైద్యులను సీనియర్ సిటిజన్ల సంఘం బాధ్యులు మంగళవారం సత్కరించారు. కోవిడ్ సంక్షోభ సమయంలో గాంధీ ఆసుపత్రిలో ప్రాణాలకు తెగించి కరోనా బాధితులకు చికిత్స చేసిన డాక్టర్ సురసుర రాధాకృష్ణ, వృద్ధులకు వినికిడి పరీక్షలు చేసి సంబంధిత యంత్రాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ యాదగిరి, డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ క్రాంతి రేఖ సత్కారం అందుకున్న వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్లకు తమ ఆసుపత్రుల్లో కన్సల్టేషన్ ఫీజు లేకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తామని హామీ ఇచ్చినట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చేపూరి బుచ్చయ్య, డాక్టర్ జనపాల శంకరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లు దొంత దేవదాసు, శ్రీగాద మైసయ్య, ఏనుగుల ఎల్లయ్య, రాపెల్లి ముకుందం, అంకారపు జ్ఞానోభ, నక్క మనోహర్, ఇరుకుల్ల భాస్కర్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల విధులు బహిష్కరణ

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని కంచర్ల గ్రామపంచాయతీలో పారిశుధ్య కార్మికులు మంగళవారం విధులు బహిష్కరించారు. వారు మాట్లాడుతూ, ఎనిమిది నెలలనుంచి వేతనాలు రాకున్నా విధులు నిర్వర్తిస్తున్నామని, వెంటనే ఇవ్వాలని కోరారు.

బియ్యం పిరమాయే..



ఈమె ఎల్లారెడ్డిపేటకు చెందిన శకుంతల. స్థానికంగా కిరాణ దుకాణంలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. సన్నబియ్యం ధరలు పెరగడంతో బియ్యం ఎలా కొనేదని మదన పడుతోంది. గతేడాది బీపీటీ బియ్యం క్వింటాల్‌కు రూ.4,800 ఉండగా.. ప్రస్తుతం రూ.5,200కు చేరింది. ఇంతమొత్తం పెట్టి ఎలా కొనేదని ఆవేదన వ్యక్తం చేస్తుంది.



- నింగినంటిన ధరలతో సామాన్యుల విలవిల
- ధాన్యం దిగుబడి మెండుగా వచ్చినా అమాంతం పెరిగిన ధరలు
- పట్టించుకోని పౌరసరఫరాల అధికారులు
- ఈ సీజన్‌లో 1.70లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- ఇతర రాష్ట్రాలకు దొడ్డు, సన్న వడ్ల ఎగుమతి

బియ్యం ధరలు ఇలా..

క్వింటాలుకు	గతేడాది	ప్రస్తుతం
బీపీటీ(కొత్తవి)	4,000	4,400
బీపీటీ(పాతవి)	4,800	5,200
జైశ్రీరాం(కొత్తవి)	5,400	5,800
జైశ్రీరాం(పాతవి)	6,000	6,800
హెచ్ఎంటీ	5,500	6,000
బాస్మతి	9,000	12,000
సోనామసూరి	4,800	5,200

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బియ్యం ధరలు భగ్గుమంటున్నాయి. మునుపెన్నడూ లేని ధరలతో సామాన్యులు బియ్యం కొనలేని పరిస్థితులు ఎదురవుతున్నాయి. గత సీజన్‌లో కంటే వరి ధాన్యం రెట్టింపు స్థాయిలో రైతులు పండించినా బియ్యం ధరలు అమాంతం పెరగడంతో మార్కెట్లో సన్నబియ్యం కొనలేని పరిస్థితి ఉంది. దీనికి ముఖ్యకారణం ఇక్కడ రైతులు పండించిన దొడ్డువడ్లను దళారులు అధిక ధరలకు ఇతర రాష్ట్రా తరలించడం, స్థానికంగా సన్నవడ్లను పండించకపోవడంతోనే వడ్ల కొరత ఏర్పడి బియ్యం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

జిల్లాలో ఈ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా కొనుగోలు చేశారు. వర్షాలు బాగా పడడంతో రైతులు విస్తారంగా వరి సాగుచేశారు. రైతుల నుంచి ఇప్పటి వరకు 1.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు అధికారులు చెబుతున్నారు. ఇంత పెద్ద మొత్తంలో ధాన్యం దిగుమతులు వచ్చినప్పటికీ బియ్యం ధరలు అమాంతం పెరగడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ పండించిన ధాన్యాన్ని మిల్లర్లు మిల్లింగ్ చేసిన తర్వాత తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలకు తరలిస్తున్నా రు. దీంతో ఈ ఏడాది బియ్యం ధరలు సామాన్యులకు అందనంత దూరంలో ఉన్నాయి. ఇతర రాష్ట్రాలకు ఇక్కడి నుంచి వడ్లు ఎగుమతిని అడ్డుకుంటే ఈ పరిస్థితి ఉండేది కాదని పలువురు అంటున్నారు.

సన్నవడ్ల దిగుబడి లేకనే..

జిల్లాలో రైతులు సన్నరకం వడ్ల సాగుపై ఆసక్తి చూపకపోవడంతో పంట దిగుబడులు పూర్తిగా తగ్గాయి. ఇక్కడ సన్నవడ్లు పండించకపోవడంతో మిల్లర్లు ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఉదాహరణకు కోదాడ, నిజామాబాద్, పెద్దపల్లి, మిర్యాలగూడ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల నుంచి సన్నవడ్లను దిగుమతి చేసుకొని వాటిని బియ్యంగా మార్చడానికి ఎక్కువ మొత్తంలో ఖర్చు అవుతుంది. మిల్లర్లు అన్ని ఖర్చులను కలుపుకొని మార్కెట్లో అమ్ముతుండడంతో ధరలు పెరిగిపోతున్నాయి. స్థానికంగా సన్నవడ్లను ఇక్కడి రైతులు సాగుచేస్తే ఈ పరిస్థితులు ఉండేవి కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పన్నులు ఎత్తివేసినా..

జీఎస్టీ రాక ముందు మిల్లర్లు,వ్యాపారులు ప్రతి క్వింటాలుపై 4 శాతం పన్నులు చెల్లించేవారు. కాగా జీఎస్టీ అమలులోకి వచ్చిన నేపథ్యంలో వ్యవసాయాధారిత ఉత్పత్తులపై పన్నులను పూర్తిగా తొలగించారు. దీంట్లో భాగంగా బియ్యంపై వ్యాట్‌ను పూర్తిగా ఎత్తివేశారు. కేవలం వడ్లకు మాత్రమే ఒక్క శాతం మార్కెట్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. కాగా ప్రస్తుత పరిస్థితి భిన్నంగా ఉంది. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే ధాన్యం ధరలు పెరిగిపోయాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధికారులు చర్యలు తీసుకోవాలి



రైతులు పండించిన ధాన్యాన్ని బియ్యం రూపంలో మార్చిన తర్వాత రైతులే తినలేని పరిస్థితులు ఉన్నాయి. జిల్లాలో అమాంతం పెరిగిన ధరలతో సామాన్యులు అన్నం తినే పరిస్థితి కనిపించడం లేదు. ధరలు ఒకేసారి పెరగడానికి కారణాలు తెలుసుకొని ఇందుకు కారకులపై చర్యలు తీసుకోవాలి.
– నిమ్మ నారాయణరెడ్డి, భారతీయ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు

పెరిగిన ధరలపై ఆరా తీస్తున్నాం



జిల్లాలో ఇటీవల బియ్యం ధరలు పెరిగినవి. ఇందుకు గల కారణాలు తెలుసుకుంటున్నాం. రైతులు పండించిన ధాన్యం ఇతర రాష్ట్రాలకు తరలిపోవడంతోనే బియ్యం ధరలు పెరిగి పోతున్నాయి. జిల్లాలో సన్న వడ్ల సాగు తక్కువగా ఉంటుంది. కోదాడ, మిర్యాలగూడ నుంచి సన్నవడ్లను కొనడంతో బియ్యం ధరలు పెరిగిపోతున్నాయి.
– జితేందర్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి

ఎస్సీలకు రాజ్యాంగ హక్కులు దక్కాల్సిందే



మాట్లాడుతున్న జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రాంచందర్

- అధికారులు క్రమశిక్షణతో సేవలందించాలి
- జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రాంచందర్

సిరిసిల్ల: దేశ జనాభాలో ఎక్కువశాతం ఉన్న ఎస్సీలకు రాజ్యాంగపరమైన హక్కులు దక్కాల్సిందేనని, ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ అన్నారు. మగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేసి ఎస్సీలకు అందేలా చూడాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో తప్పని సరిగా వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేయాలని సూచించారు. ఎవరైనా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తే వారిపై చర్యలుంటాయన్నారు. జిల్లా స్థాయిలో ప్రతి ఒక్క అధికారి క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేయాలని, అట్రాసిటి కేసుల్లో సకాలంలో పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ ఎస్సీ కమిషన్ సంచాలకులు సునీల్‌కుమార్‌బాబు, రీసర్చ్ అధికారి డి.వరప్రసాద్, అడిషనల్ కలెక్టర్ ఎస్.ఖీమ్యా నాయక్, ఆర్డీవోలు ఎల్.రమేశ్, రాజేశ్వర్, ఎస్సీ కార్పొరేషన్ డీఈ వినోద్‌కుమార్, డీఈవో రమేశ్‌కుమార్, డీఆర్‌డీవో శేషాద్రి, డీపీవో వీరబుచ్చయ్య, పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్, సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, టౌన్ సీఐ రఘుపతి పాల్గొన్నారు.



గోడు వినిపిస్తున్న నేరెళ్ల బాధితుడు బాలరాజు

నేరెళ్ల బాధితులను ఆదుకుంటాం

తెలంగాణ చరిత్రలో నేరెళ్ల ఘటన దారుణమని, అది మాయని మచ్చగా నిలిచిపోతుందని రాంచందర్ అన్నారు. కలెక్టరేట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతుండగా.. నేరెళ్ల బాధితులు చెప్యాల బాలరాజు వచ్చి నాటి ఘటనను, పోలీసుల తీరును, బాధితులకు దక్కని న్యాయంపై ప్రశ్నించారు. నాటి ఘటనకు బాధ్యులైన అప్పటి ఎస్పీ విశ్వజిత్ కంపాటి, ఎస్సై రవీందర్‌కు ప్రమోషన్ లభించిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన రాంచందర్ తప్పకుండా నేరెళ్ల ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అంతకు ముందు దళిత సంఘాల ప్రతినిధులు ఆయన్ని కలిసి జిల్లాలోని పలు సమస్యలపై వివరించారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు

- ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడరూరల్: గంజాయి విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. గంజాయి విక్రయిస్తున్న నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి, 14.590 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వేములవాడ రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం మయుర్బాని జిల్లాకు చెందిన పుర్తీ బిర్ష అనే వ్యక్తి అక్కడే గుర్తు తెలియని వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. పక్కా సమాచారం మేరకు వేములవాడ పట్టణం చెక్కపల్లి రోడ్డు వద్ద నిందితుడిని పోలీసులు పట్టుకున్నట్లు వివరించారు. జిల్లాలో గంజాయి నిర్మూలనకు పోలీస్ శాఖ గట్టి చర్యలు చేపడుతుందన్నారు. ఎవరైనా విక్రయిస్తున్నట్లు తెలిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని, వారి పేరు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని కోరారు. జిల్లాలో 2024లో ఇప్పటి వరకు 41 కేసుల్లో 99 మందిని అదుపులోకి తీసుకుని 34 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టి గంజాయికి బానిస కాకుండా కౌన్సెలింగ్ ఇవ్వాలని కోరారు. గంజాయికి అలవాటు పడి మానుకోలేని స్థితిలో ఉన్నవారి కోసం జిల్లా కేంద్రంలో డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసి వైద్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, ఎస్సై ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

కోనరావుపేట(వేములవాడ): రైతుల ఆర్థికాభివృద్ధికి సింగిల్‌విండో కృషి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. మండలంలోని కొలనూర్ సింగిల్‌విండోలో రూ.15 లక్షలతో నిర్మించిన గోడ, రామన్నపేటలో రూ.50 లక్షలతో నిర్మించిన విలేజ్ కమ్యూనిటీ హాల్, వివిధ సంఘాల ప్రహరీలను మంగళవారం ప్రారంభించి మాట్లాడారు.కోనరావుపేట మండలంలో ఇప్పటి వరకు రూ.4 కోట్ల మేర అభివృద్ధి పనులు జరిగాయన్నారు. మండలాన్ని ఐదేళ్లకాలంలో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ సంకినేని రామ్మోహన్‌రావు, వైస్‌చైర్మన్ కాశవేణి మహేశ్, డైరెక్టర్లు జవ్వాజి దేవయ్య, కాసారపు శ్రీనివాస్, ఇప్ప రాములు, సత్యనారాయణరావు, జలగం సాయికిరణ్, సీఈవో రాజేశం పాల్గొన్నారు.



ప్రహరీ ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

అభిప్రాయ సేకరణ మోసపూరిత చర్య

- నాఫ్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): రైతుబంధుపై అన్నదాతల అభిప్రాయ సేకరణతో రాష్ట్ర ప్రభుత్వం మోసపూరిత చర్యకు పాల్పడుతోందని నాఫ్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు విమర్శించారు. గంభీరావుపేట మండలకేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు చెప్పిందే తాము చేస్తున్నామని చెప్పడానికి ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. రైతుబంధును సకాలంలో అందించాలన్నారు. రైతుబీమా పథకాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల, పట్టణ ఉపాధ్యక్షులు వెంకటస్వామిగౌడ్, వెంకటియాదవ్, సెస్ డైరెక్టర్ నారాయణరావు, నాయకులు దయాకర్‌రావు, రాజారాం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాఫ్‌కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

న్యాక్ శిక్షణ.. భవిష్యత్‌కు నిచ్చెన

- కార్మికుల పిల్లలకు భూమి కొలతలపై ట్రెయినింగ్
- సిరిసిల్లలో భూ సర్వేపై ఆధునిక తర్ఫీదు



ఇతడి పేరు లావుడ్య శశాంక్. కోనరావుపేట మండలం గోవింద రావుపల్లె శివారులోని లచ్చపేట గిరిజన తండాకు చెందిన శశాంక్ ఇంటర్ చదివాడు. తండ్రి ఆటో డ్రైవర్‌గా వేములవాడ మండలం అగ్రహారంలో స్థిరపడ్డారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)లో భూమి కొలతలపై మూడు నెలలుగా శిక్షణ పొందుతున్నాడు. ఈ శిక్షణ మరో రెండు రోజుల్లో ముగియనుంది.



ఈ అమ్మాయి పేరు కుర్మాచలం హర్షిణి. సిరిసిల్ల గీతానగర్‌కు చెందిన హర్షిణి ఇంటర్ వరకు చదువుకుంది. అమ్మ బీడీలు చేస్తుంది. నాన్నా చిన్న దుకాణం నిర్వహిస్తాడు. ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్న హర్షిణికి న్యాక్ కేంద్రంలో భూమి కొలతపై సర్వే శిక్షణకు ముందుకొచ్చింది. మూడు నెలలుగా శిక్షణ పొందింది. ఇక్కడ నేర్చుకున్న సర్వే అంశాలతో క్షేత్రస్థాయిలో ఉపాధి పొందే అవకాశాన్ని అందిపుచ్చుకుంది.



ఇతడి వేములవాడ రూరల్ మండలం నమిగుండుపల్లెకు చెందిన నవీన్. డిగ్రీ వరకు చదివాడు. అమ్మా రమ, నాన్న తిరుపతి వ్యవసాయం చేస్తారు. డిగ్రీ తర్వాత ఖాళీగా ఉంటున్న నవీన్ సిరిసిల్ల న్యాక్ కేంద్రంలో మూడు నెలలుగా జీపీఎస్ మిషన్‌పై భూమి కొలత విధానంపై శిక్షణ పొందాడు. శిక్షణలో నేర్చుకున్న అంశాల ఆధారంగా క్షేత్ర స్థాయిలో జీపీఎస్ సిస్టమ్‌పై భూమిని సర్వే చేయనున్నారు.

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలోని న్యాక్ కేంద్రంలో 18 మంది భూసర్వేపై శిక్షణ పొందుతున్నారు. వీరంతా నిరుపేద కార్మిక, వ్యవసాయ కుటుంబాలకు చెందినవారు. కేవలం కార్మికులుగా గుర్తింపు కార్డులు పొందినవారి పిల్లలకే ప్రత్యేకంగా న్యాక్ ద్వారా భూసర్వేపై జీపీఎస్(గూగుల్ పొజిషన్ సిస్టమ్)పై శిక్షణ ఇస్తున్నారు. గతంలో ఇనుప గొలుసులు పట్టి భూమిని కొలిచేవారు. కానీ ఇప్పుడు శాటిలైట్ విధానంలో గూగుల్ పొజిషన్ సిస్టమ్ ద్వారా నేరుగా అక్షాంశ, రేఖాంశాల ఆధారంగా భూమిని శాస్త్రీయంగా కొలుస్తున్నారు.

నమ్మకమైన ఉపాధికి బాటలు

భూమి కొలతలకు సంబంధించి సర్వే చేసేవారి సంఖ్య తక్కువగా ఉంది. నిత్యం భూవివాదాలు ఎక్కువయ్యాయి. భూమి హద్దులకు సంబంధించి సర్వే చేయాలని భూమి కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్, డివిజనల్ ఇన్‌స్పెక్టర్, మండల సర్వేయర్లకు దరఖాస్తులు చేసే వారి సంఖ్య పెరిగింది. పాత తరం భూమి కొలతలపై నమ్మకాలు సడలిపోవడంతో ఆధునిక విధానంలో సర్వే చేయించుకోవాలని భావిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో శాస్త్రీయంగా భూములను కొలిచే వారి సంఖ్య జిల్లాలో తక్కువగా ఉంది. కానీ నమ్మకంగా భూములను కొలిచే వ్యక్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ప్రభుత్వం చూడా ప్రైవేటు సర్వేయర్లకు జీపీఎస్ మిషన్ ఉంటే లైసెన్స్ జారీ చేస్తుంది. భూమి కొలతలపై నైపుణ్యం ఉంటే నమ్మకమైన ఉపాధికి అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లాలో ఐదుగురు యువతులు, 13 మంది యువకులకు భూసర్వేపై శిక్షణ ఇస్తున్నారు. మరోవైపు క్షేత్రస్థాయిలోనూ వారితో భూసర్వేలు చేయిస్తున్నారు. శిక్షణ కేంద్రంలోనే భోజనం, టీ, స్నాక్స్ అందిస్తూ తర్ఫీదు ఇస్తున్నారు. వీరంతా న్యాక్ ద్వారా సర్టిఫికెట్లు పొంది నేరుగా క్షేత్రస్థాయిలో మరింత అనుభవం సాధిస్తే ఉపాధికి ఢోకా ఉండదు.



భూ సర్వేపై శిక్షణ ఇస్తున్న న్యాక్ కేంద్రం ఇన్‌చార్జి గంగాధర్

కార్మికుల పిల్లలకే..



సిరిసిల్లలో న్యాక్ ద్వారా భూసర్వేలో శిక్షణ ఇస్తున్నాం. ఇక్కడ శిక్షణ పొందే వారంతా కార్మికులుగా గుర్తింపు కార్డులు ఉన్న వారి పిల్లలను ఎంపిక చేశాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి సంయుక్తంగా తర్ఫీదు ఇస్తుంది. మార్చి 30న ప్రారంభమైన శిక్షణ ఈనెల 4న ముగుస్తుంది. యువతీ, యువకులు ఎంతో ఓర్పుగా శిక్షణ పొందారు. క్షేత్రస్థాయిలో పని చేసేందుకు వీలుగా నైపుణ్యం సాధించారు.
– వి.గంగాధర్, న్యాక్ కేంద్రం ఇన్‌చార్జి, సిరిసిల్ల

ఎంపిక పోటీలకు విద్యార్థుల జాబితా విడుదల

సిరిసిల్లకల్చరల్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న హకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్‌లోని క్రీడా పాఠశాలల్లో 4వ తరగతి ప్రవేశాలకు జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థుల జాబితాను జిల్లా క్రీడల అధికారి అజ్మీర రాందాస్ విడుదల చేశారు. 21 మంది బాలురు 11 మంది బాలికలు ఎంపికయ్యారు. వీరంతా ఈ నెల 8న హకీంపేటలో జరిగే పోటీలకు హాజరుకావాల్సి ఉంటుంది. ప్రతి విద్యార్థి ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ, జనన ధ్రువీకరణ పత్రాలు, మూడో తరగతి ప్రోగ్రెస్ కార్డు, ఐదు పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలతో హాజరు కావాలని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల అనంతరం క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు సంబంధించిన తుది జాబితా విడుదల అవుతుందని జిల్లా క్రీడల శాఖ అధికారి పేర్కొన్నారు.

బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేయాలి

సిరిసిల్లఎడ్యుకేషన్: చాలా సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఎస్జీటీలకు వచ్చిన బదిలీ అవకాశాలను కాలరాసేలా అధికారుల తీరు ఉందని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణప్రసాద్‌గౌడ్ విమర్శించారు. ఈమేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ, బదిలీ అయిన ఉపాధ్యాయులకు వెంటనే రిలీవ్ ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధ్యాయులు లేని పాఠశాలలో విధిగా వెంటనే విద్యావలంటీర్లను సమకూర్చాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మల్లయ్య (ఫైల్)

హుజూరాబాద్‌రూరల్‌/శంకరపట్నం: ఓ వ్యక్తి తన అత్తగారి ఊరైన హుజూరా బాద్‌ మండలంలోని వెంకట్రావుపల్లెలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలంలోని ఆముదాలపల్లికి చెందిన గాజబోయిన మల్లయ్య(37) సోమవారం తన ట్రాక్టర్‌ తీసుకొని, అత్తగారి పొలం దున్నేందుకు వెళ్లాడు. అయితే, ఆ పొలానికి దగ్గరలోని మరో పొలంలో స్థానికులకు మంగళవారం శవమై కనిపించాడు. చనిపోయిన చోట ట్రాక్టర్‌ రౌండ్లు వేసినట్లు ఉండటం, అది బోల్తా పడకపోవడం, మల్ల య్య చేతులకు గాయాలై, రక్తస్రావమవడంతో కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వారి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేశ్‌ పేర్కొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి


ఆగవ్వ (ఫైల్)

జగిత్యాలరూరల్‌: మండలంలోని బాలపల్లికి చెందిన పడిగెల ఆగవ్వ(103) మృతిచెందింది. స్థానికుల వివరాల ప్రకారం.. ఆగవ్వకు ఐదుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు సంతానం. వీరిలో ముగ్గురు కుమారులు గతంలోనే చనిపోయారు. 3 నెలల క్రితం వరకు ఆమె తన పనులు తానే చేసుకునేది. 2 నెలల క్రితం గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స జరగడంతో ఆగవ్వ బాగోగులను కుమారులు చూసుకుంటున్నారు. ఈ క్రమంలో వృద్ధాప్య కారణాలతో మంగళవారం ఉదయం ఆమె చనిపోయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మృతురాలి కుటుంబసభ్యులను ఓదార్చి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

వ్యక్తిని చితకబాదిన యువకులు

చిగురుమామిడి(హుస్నాబాద్‌): ఓ వ్యక్తిని చితకబాదిన ఐదుగురు యువకులపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్‌ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సైదాపూర్‌ మండలం దుద్దెనపల్లికి చెందిన నీలా శ్రీనివాస్‌ సోమవారం రాత్రి 11 గంటలకు స్వగ్రామం వెళ్లేందుకు సుందరగిరి చౌరస్తా వద్ద బస్సు కోసం చూస్తున్నాడు. మద్యం మత్తులో వచ్చిన గందె అఖిల్‌, గిరబోయిన అజయ్‌, వేణు, ఎల్కపెల్లి నాగరాజు, దుర్గం సుమిత్‌ అతన్ని చితకబాదారు. అంతటితో ఆగకుండా వెంట తెచ్చుకున్న బీరుసీసా పగులగొట్టి హత్య చేసేందుకు ప్రయత్నించారు. వారి నుంచి తప్పించుకున్న శ్రీనివాస్‌ మంగళవారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

జగిత్యాల క్రైం: తాళం వేసిన ఓ ఇంట్లో దొంగలు పడి, బంగారు ఆభరణాలు చోరీ చేశారు. జగిత్యాల పట్టణ ఎస్సై నరేశ్‌ వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లికి చెందిన బొల్లం స్వాతి ఎలక్ట్రికల్‌ షాపు నిర్వహిస్తోంది. సోమవారం బంధువుల ఇంటికి వెళ్లింది. మంగళవారం ఉదయం వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి, బీరువాలోని ఎనిమిదిన్నర తులాల ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించింది. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆసియా క్రీడల్లో ‘యోగా’పై సంబరాలు

- 2026లో పతకాలు లేని ప్రదర్శన క్రీడగా..
- 2030లో మెడల్‌ రౌండ్‌లలో పోటీ
- పీటీ ఉష అభ్యర్థనకు ఒలింపిక్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ ఏషియా చీఫ్‌ ఓకే
- సంబరాల్లో క్రీడాకారులు




సంబరాల్లో యోగా సంఘం చైర్మన్‌ రవీందర్‌ సింగ్‌, డీవైఎస్‌వో శ్రీకాంత్‌ రెడ్డి, ఒలింపిక్‌ సంఘం ప్రతినిధులు

కరీంనగర్‌ స్పోర్ట్స్‌: మన దేశ సంస్కృతికి ప్రతీకైన యోగా క్రీడాభివృద్ధిలో కీలక పరిణామం చోటుచేసుకుంది. మినీ ఒలింపిక్స్‌ మాదిరిగా ఆసియా దేశాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఏషియన్‌ గేమ్స్‌లో యోగా చోటు దక్కింది. సోమవారం ఏషియాడ్‌ గేమ్స్‌ తాత్కాలిక అధ్యక్షుడు రణధీర్‌ సింగ్‌ నేతృత్వంలోని ఒలింపిక్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ ఆసియా(ఓసీఏ) ఎగ్జిక్యూటివ్‌ బోర్డు సమావేశంలో దీనికి గ్రీన్‌ సిగ్నల్‌ లభించింది.

జూన్‌ 21 యోగా దినోత్సవం

ఐక్యరాజ్యసమితి జూన్‌ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా గుర్తించడంతో ఆసియా దేశాల్లో ఈ క్రీడకు విశేష గుర్తింపు లభించింది. దీంతో భారత ఒలింపిక్‌ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష గత జూన్‌ 26న ఒలింపిక్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ ఏషియా చీఫ్‌కి లేఖ రాసి, ఆసియా క్రీడల్లో యోగాను ఒక క్రీడగా చేర్చాలని కోరారు. దీనికి వారు యోగాకు ఓకే చెప్పారు. 2026లో జపాన్‌లోని నగోయాలో జరగనున్న ఆసియా క్రీడల్లో ఎటువంటి పతకాలు లేకుండా యోగాను ప్రదర్శన క్రీడగా చేర్చనున్నారు. అలాగే, 2030లో జరిగే దోహా ఆసియాడ్‌లో మెడల్‌ రౌండ్‌లతో పోటీ క్రీడగా పరిగణించనున్నారు.

పోటీపడే అంశాలివే..

5 ఈవెంట్‌లలో యోగా పోటీలు జరగనున్నాయి. సంప్రదాయ యోగాసన, కళాత్మక యోగాసన (సింగిల్‌, పెయిర్‌), రిథమిక్‌ యోగాసన (జత, ఫ్రీ ఫ్లో/గ్రూప్‌ యోగాసన), వ్యక్తిగత ఆల్‌ రౌండ్‌ చాంపియన్‌షిప్‌, టీం చాంపియన్‌షిప్‌లలో పోటీలు జరుగుతాయి. విజేతలకు బంగారు, రజత, కాంస్య పతకాలు సైతం అందిస్తారు. పురుషులు, మహిళలకు కలిపి మొత్తం 15 పతకాలు(5 స్వర్ణాలు, 5 రజతాలు, 5 కాంస్యాలు) అందించనున్నారు.

జిల్లాలో హర్షాతిరేకాలు..

ఆసియా క్రీడల్లో యోగాకు చోటు కల్పించడంతో కరీంనగర్‌ జిల్లాలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. యోగా అసోసియేషన్‌ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో సంబరాలు జరిపారు. సీనియర్‌ యోగా క్రీడాకారులతోపాటు విద్యార్థులు, కోచ్‌లు వ్యాయామ ఉపాధ్యాయులు మిఠాయిలు పంచుకున్నారు. యోగాలో రాణించేవారికి ఉజ్వల భవిష్యత్‌ ఉండనుందని తెలంగాణ యోగా అసోసియేషన్‌ చైర్మన్‌, యోగా అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు సర్దార్‌ రవీందర్‌ సింగ్‌ తెలిపారు. యోగాలో అంతర్జాతీయ వేదికలపై మన దేశ క్రీడాకారులు సత్తా చాటే అవకాశం కలిగిందన్నారు. ఇందుకు చొరవ తీసుకున్న భారత ఒలింపిక్‌ సంఘానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడలు, యువజన శాఖ అధికారి శ్రీకాంత్‌ రెడ్డి, యోగా అసోసియేషన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌.సిద్ధారెడ్డి, ఒలింపిక్‌ అసోసియేషన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌ రెడ్డి, ఉపాధ్యక్షులు తుమ్మల రమేశ్‌, రమేశ్‌ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్‌ నీల ప్రసాద్‌, యోగా కోచ్‌ కిష్టయ్య, క్రీడా పాఠశాల కోచ్‌లు ఇందిర, పవన్‌, సాయిరాం యాదవ్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

యోగాకు ఆదరణ



యోగాకు తగిన గుర్తింపు ఇవ్వాలని మన దేశం చేసిన అభ్యర్థనకు ఓసీఏ అంగీకరించడం సంతోషదాయకం. యోగాకు ఆదరణ లభిస్తోంది. ఈ సమయంలో ఏషియాడ్‌లో చేర్చడం కీలక పరిణామం.

– జి.మనోహర్‌ కుమార్‌, తెలంగాణ యోగా సంఘం ప్రధాన కార్యదర్శి

క్రేజ్‌ మరింత పెరుగుతుంది



యోగాను ఒక క్రీడగా విశ్వవాప్తం చేయడానికి ఏషియాడ్‌ క్రీడలు శ్రీకారం చుట్టనున్నాయి. ఫలితంగా దీనికి క్రేజ్‌ మరింత పెరుగుతుంది. ఇప్పటికే అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటున్నాం.

– ఎస్‌.సిద్ధారెడ్డి, యోగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, కరీంనగర్‌

సత్తా చాటే అవకాశం



ఇక నుంచి అంతర్జాతీయ వేదికలపై యోగాలో మన దేశ క్రీడాకారులు సత్తా చాటే అవకాశం కలిగింది. 2030 నుంచి ఆరంభం కానున్న ఈ క్రీడలో తొలి పతకం కూడా భారత్‌ సాధిస్తుందన్న నమ్మకం ఉంది.

– కిష్టయ్య, కోచ్‌

ఆర్టీసీ లక్కీ డ్రా విజేతల ఎంపిక


డ్రా తీస్తున్న వరంగల్‌ ఆర్‌ఎం విజయ భాను

హన్మకొండ: వరంగల్‌–నిజామాబాద్‌ రూట్‌ డీలక్స్‌ బస్సుల్లో ప్రయాణించిన మహిళల్లో విజేతల్ని మంగళవారం ఆర్టీసీ లక్కీ డ్రా తీసి ప్రకటించింది. హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్‌లో జూన్‌లో 15 రోజుల పాటు ప్రయాణించిన మహిళా ప్రయాణికుల టికెట్లను ఆర్టీసీ వరంగల్‌ రీజినల్‌ మేనేజర్‌ డి.విజయ భాను డ్రా తీసి విజేతలను ప్రకటించారు. కరీంనగర్‌కు చెందిన జి.కవిత (94900 43242), చొప్పదండికి చెందిన దేవమణి (ఫోన్‌: 84999 09575), ఆర్మూరుకు చెందిన రత్న (95506 01985) విజేతలుగా ఎంపికయ్యారు. ఈసందర్భంగా ఆర్‌ఎం విజయభాను, వరంగల్‌–1 డిపో మేనేజర్‌ వంగల మోహన్‌రావు మాట్లాడుతూ.. డీలక్స్‌ బస్సుల్లో ప్రత్యేక గిఫ్ట్‌ బాక్సులను ఏర్పాటు చేశామని, మహిళా ప్రయాణికులు బస్సు దిగేముందు తమ టికెట్‌ వెనుక పేరు, ఫోన్‌ నంబర్‌ రాసి గిఫ్ట్‌ బాక్స్‌లో వేయాలని సూచించారు. ప్రతీ 15 రోజులకోసారి డ్రా తీసి, గెలుపొందిన మహిళా ప్రయాణికులకు బహుమతులు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్‌ మేనేజర్‌ ఆపరేషన్స్‌ కేశరాజు భాను కిరణ్‌, అసిస్టెంట్‌ మేనేజర్‌ చిమ్మని సంతోశ్‌ కుమార్‌, సిబ్బంది ప్రయాణికులు పాల్గొన్నారు.

రేపు బాలికల ఫుట్‌బాల్‌ జట్టు ఎంపిక పోటీలు

కరీంనగర్‌ స్పోర్ట్స్‌: కరీంనగర్‌ సెయింట్‌జాన్‌ పాఠశాలలో ఉమ్మడి జిల్లాస్థాయి సబ్‌ జూనియర్స్‌ బాలికల ఫుట్‌బాల్‌ జట్టు ఎంపిక పోటీలను గురువారం నిర్వహించనున్నట్లు ఫుట్‌బాల్‌ సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి గణపతి తెలిపారు. ఎంపికైనవారు త్వరలో మహబూబ్‌నగర్‌ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులు 1 జనవరి 2011 నుంచి 31 డిసెంబర్‌ 2012 మధ్య జన్మించినవారు అర్హులని, ఆధార్‌కార్డు, జనన ధ్రువపత్రం, 4 పాస్‌పోర్టు సైజ్‌ ఫొటోలతో ఉదయం 9 గంటలకు పాఠశాలలో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫుట్‌బాల్‌ సంఘం ఉపాధ్యక్షుడు అంతటి శంకరయ్యను 98491 14956 ఫోన్‌ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బాలికపై లైంగిక దాడికి యత్నించిన వృద్ధుడు

- దేహశుద్ధి చేసిన స్థానికులు

కాల్వశ్రీరాంపూర్‌(పెద్దపల్లి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలికపై ఓ వృద్ధుడు లైంగిక దాడికి యత్నించాడు. పోలీసుల కథనం ప్రకారం.. బాలిక సోమవారం తన ఇంటి ఎదుట ఆడుకుంటోంది. ఆమెపై కన్నేసిన వృద్ధుడు మాయమాటలు చెప్పి, బస్సులు ఆగే స్థలంలోని బాత్‌రూంలోకి తీసుకెళ్లాడు. లైంగిక దాడికి యత్నించగా ఆ బాలిక భయంతో కేకలు వేసింది. స్థానికులు పరిగెత్తుకు వచ్చి, వృద్ధుడికి దేహశుద్ధి చేశారు. తర్వాత అతనిను కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై బాధిత కుటుంబసభ్యులు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భారతీయ న్యాయ సంహిత చట్టం కింద కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


గాయపడిన చిన్నారి

శంకరపట్నం(మానకొండూర్‌): రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. ములుగు జిల్లాకు చెందిన సిల్ల సారయ్య తన రెండేళ్ల కూతురితో కలిసి మంగళవారం జగిత్యాల నుంచి ద్విచక్రవాహనంపై స్వస్థలానికి వెళ్తున్నాడు. శంకరపట్నం మండలంలోని లింగాపూర్‌కు చెందిన కోడూరి మొగిలి కేశవపట్నం నుంచి బైక్‌పై స్వగ్రామం వెళ్తున్నాడు. కేశవపట్నం శివారులో రెండు వాహనాలు ఢీకొనడంతో పాపతోపాటు సారయ్యకు తీవ్ర గాయాలవగా మొగిలికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను పోలీసులు ఆస్పత్రికి తరలించారు.

మేడిపల్లి, నిజామాబాద్‌లో చోరీలు


స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, నగదు


అరెస్టు చూపుతున్న పోలీసులు

- ఇద్దరు దొంగల అరెస్టు
- బంగారు ఆభరణాలు, వెండి, నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌

మెట్‌పల్లిరూరల్‌: మెట్‌పల్లి మండలం మేడిపల్లిలోని రెండిళ్లలో చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిజామాబాద్‌ జిల్లా మాదాపూర్‌కు చెందిన దర్పల్లి సాయిలు, బాసరకు చెందిన కోసిడియా మోహన్‌ జల్సాలకు అలవాటుపడి, చోరీలు చేస్తున్నారు. ఇటీవల జగిత్యాల జిల్లా సరిహద్దు శివారులోని గండి హనుమాన్‌ ఆలయ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో మేడిపల్లి, నిజామాబాద్‌లలో దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి 3 ద్విచక్రవాహనాలు, 8 తులాల బంగారం, 10 తులాల వెండి, రూ.20 వేలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. సాయిలుపై 22, మోహన్‌పై 14 కేసులు ఉన్నాయని, ఈ మధ్యనే జైలు నుంచి విడుదలై వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో మెట్‌పల్లి సీఐ నిరంజన్‌ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్‌, పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

కరెంట్‌ వైర్ల దొంగ పట్టివేత


దొంగను తీసుకెళ్తున్న పోలీసులు

రామడుగు(చొప్పదండి): విద్యుత్‌ మోటార్లలోని వైర్లను ఎత్తుకెళ్తున్న దొంగను రామడుగు మండలంలోని షానగర్‌ రైతులు పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. వరంగల్‌ జిల్లా వర్ధన్నపేట మండలంలోని పీరామ్‌గూడకు చెందిన బొమ్మిశెట్టి అశోక్‌తో పాటు మరికొందరు మంగళవారం మధ్యాహ్నం షానగర్‌లో వరద కాలువ వెంట ఉన్న కరెంట్‌ మోటార్లలో నివైర్లను చోరీ చేశారు. వాటిని పందికుంటపల్లి వైకుంఠ ధామం రూమ్‌లో ఉంచడాన్ని రైతులు గుర్తించారు. అశోక్‌ను పట్టుకొని, వివరాలు తెలుసుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. అతన్ని అదుపులోకి తీసుకొని, రామడుగు ఠాణాకు తరలించారు.

విధులకు ఆటంకం కలిగించిన వడ్డీ వ్యాపారుల అరెస్టు

మెట్‌పల్లి(కోరుట్ల): పోలీస్‌ విధులకు ఆటంకం కలిగించిన మెట్‌పల్లి పట్టణానికి చెందిన వడ్డీ వ్యాపారులు కటకం ప్రకాశ్‌, అతని కుమారుడు కార్తీక్‌లను అరెస్టు చేసినట్లు ఎస్సై చిరంజీవి మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. స్థానికంగా అనుమతి లేకుండా వడ్డీ వ్యాపారం చేస్తున్నవారి ఇళ్లలో గత ఏప్రిల్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రకాశ్‌ ఇంట్లోనూ తనిఖీ చేయగా పెద్ద ఎత్తున బంగారం, నగదు లభ్యమైంది. వాటిని సీజ్‌ చేయడానికి ప్రయత్నించగా, ప్రకాశ్‌తోపాటు అతని కుమారుడు కార్తీక్‌ అడ్డుకున్నారు. పోలీస్‌ సిబ్బందిని దూషించడమే కాకుండా ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించారు. దీనిపై అప్పట్లో కేసు నమోదైందని ఎస్సై పేర్కొన్నారు. ఈ మేరకు తండ్రీకుమారుడిని సోమవారం రాత్రి అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

టూరిస్ట్‌ మినీ బస్సు బోల్తా

- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు


బోల్తా పడిన మినీ బస్సు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): టూరిస్ట్‌ మినీ బస్సు బోల్తా పడిన ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల ప్రకారం.. టూరిస్ట్‌ మినీ బస్సు మంగళవారం కరీంనగర్‌ నుంచి కామారెడ్డి వైపు వెళ్తోంది. ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్‌–రగుడు బైపాస్‌ రోడ్డులోని పెద్దబోనాల శివారులో అతివేగం కారణంగా డివైడర్‌ను ఢీకొట్టి, బోల్తా పడింది. ఈ ఘటనలో డివైడర్‌ మధ్యలో ఉన్న కరెంటు పోల్‌ విరిగి, రోడ్డుపై పడింది. బస్సు డ్రైవర్‌ తీవ్రంగా గాయపడి, క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో చుట్టుపక్కల పొలాల్లో పనిచేస్తున్న రైతులు పరిగెత్తుకు వచ్చారు. అతన్ని బయటకు తీసి, 108కు ఫోన్‌ చేయగా సిబ్బంది వచ్చి, సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్‌ ఢీకొని మహిళ దుర్మరణం


లక్ష్మి (ఫైల్‌)

పెద్దపల్లిరూరల్‌: ఇసుక ట్రాక్టర్‌ ఢీకొని ఓ మహిళ మృతిచెందింది. ఎస్సై లక్ష్మణ్‌రావు కథనం ప్రకారం.. పెద్దపల్లి మండలంలోని అందుగులపల్లికి చెందిన ఆరె సదయ్య తన భార్య లక్ష్మి(38)తో కలిసి చొప్పదండిలోని అత్తగారింట్లో జరిగిన బోనాల పండుగకు వెళ్లాడు. మంగళవారం బైక్‌పై తిరిగి వస్తుండగా నిట్టూరు వద్ద రాంగ్‌రూట్‌లో అతివేగంగా వచ్చిన ఇసుక ట్రాక్టర్‌ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌ లక్ష్మి తల పైనుంచి వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. సదయ్యకు గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కారు ఢీకొని వృద్ధురాలు..

రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతిచెందింది. ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరికి చెందిన ధరావత్‌ సత్తమ్మ(60) కుటుంబసభ్యులతో కలిసి ఉపాధి నిమిత్తం పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల గ్రామానికి వచ్చింది. స్థానికంగానే ఉంటూ చుట్టుపక్కల ఊళ్లలో అల్లం, ఉల్లిపాయలు, మిరపకాయలు విక్రయిస్తోంది. ఈ క్రమంలో మంగళవారం పెద్దకల్వలలోనే రోడ్డు దాటుతుండగా కరీంనగర్‌ నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న ఓ కారు ఢీకొట్టి, వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. కాగా, ఆమె ఇద్దరు కుమారులు గతంలోనే చనిపోగా కోడళ్లు, మనవలు, మనవరాళ్లు ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ బీజేపీ నాయకుడి మృతి


నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు


రాజు (ఫైల్‌)

పెద్దపల్లిరూరల్‌: బీజేపీ పెద్దపల్లి నియోజకవర్గ కన్వీనర్‌ పిన్నింటి రాజు చికిత్స పొందుతూ మృతిచెందారు. వివరాల్లోకి వెళ్తే.. బెజ్జంకి మండలంలోని తోటపల్లికి చెందిన రాజు పెద్దపల్లిలో ఉంటున్నారు. గతంలో బీజేపీ పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతుండటంతో కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున చనిపోయారు. రాజు మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, నాయకులు అర్జున్‌రావు, సంజీవరెడ్డి, కన్నం అంజయ్య, పర్శ సమ్మయ్య, రాజేందర్‌, శ్రీనివాసరావు, తూడి రవీందర్‌ తదితరులు నివాళి అర్పించారు. ఆయనకు ఇద్దరు కుమారులున్నారు. తోటపల్లిలో నిర్వహించిన అంత్యక్రియలకు పెద్దపల్లి నుంచి పలువురు నాయకులు తరలివెళ్లారు.

అతిగా మద్యం సేవించి వ్యక్తి..

ధర్మపురి: అతిగా మద్యం సేవించి, ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ధర్మపురిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా దండెపెల్లి మండలంలోని చింతలపల్లెకు చెందిన నల్ల మల్లేశ్‌(35) భార్య అతని నుంచి విడాకులు తీసుకొని, పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో అతను గ్రామంలో ఉండలేక కొంతకాలంగా ధర్మపురిలోని తల్లి వద్ద ఉంటూ తాపీమేస్త్రీగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో అతిగా గుడుంబా, మద్యం తాగుతున్నాడు. సోమవారం రాత్రి కూడా అతిగా సేవించి, అంబేడ్కర్‌ విగ్రహం వద్ద జాతీయ రహదారి పక్కనున్న కంకర కుప్పపై పడుకున్నాడు. నిద్రలోనే మృతి చెందాడు. మంగళవారం ఉదయం రోడ్డు పై వెళ్తున్నవారు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఏ ఎస్సై రాజు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని, మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మల్లేశ్‌ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతిగా గుడుంబా, మద్యం సేవించి మృతిచెంది ఉంటాడని తెలిపారు. మృతుడి తల్లి పోశవ్వ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు. ధర్మపురిలో విచ్చలవిడిగా గుడుంబా తయారు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు.

గొధూర్‌కు చెందిన మహిళ..


లక్ష్మి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అనిల్‌

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండలంలోని గొధూర్‌కు చెందిన నల్ల లక్ష్మి(54) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై అనిల్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. లక్ష్మి భర్త సంజీవరెడ్డి రెండేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకోగా అప్పటినుంచి ఆమె మానసిక వేదనకు గురవుతోంది. ఎవరితోనూ మాట్లాడేది కాదు. గత నెల 29న కుటుంబసభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లగా.. ఇంట్లోనే క్రిమిసంహారక మందు తాగింది. తర్వాత వచ్చిన కుటుంబసభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి చనిపోయింది. మృతురాలి కుమారుడు రాజశేఖర్‌రెడ్డి మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చాకుంటకు చెందిన యువకుడు..

చొప్పదండి: మండలంలోని చాకుంటకు చెందిన తడిగొప్పుల మహేశ్‌(27) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై ఉపేంద్రచారి కథనం ప్రకారం.. తడిగొప్పుల కొమురయ్యకు ముగ్గురు కుమారులున్నారు. చిన్న కొడుకు మహేందర్‌ 2 నెలల క్రితం నగునూరులో రూ.6 లక్షల పెట్టుబడితో పెయింట్స్‌ దుకాణం ఏర్పాటు చేశాడు. వ్యాపారం అనుకున్నట్లు నడవకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీనికితోడు అప్పుల బాధ భరించలేక గత నెల 28న ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు 108 వాహనంలో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం చనిపోయాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వేర్వేరు చోట్ల నలుగురి ఆత్మహత్య

రాజన్నసిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో మద్యానికి బానిసై, అప్పుల బాధతో, ఆర్థిక ఇబ్బందులతో మంగళవారం నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. వారి కుటుంబసభ్యులకు తీరని శోకాన్ని మిగిల్చారు.

మద్యానికి బానిసై యువకుడు..


అజయ్‌ (ఫైల్‌)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన తంగళ్లపల్లి మండలంలోని నేరెళ్ల గ్రామంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబసభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం.. ఐతం అజయ్‌(25) మద్యానికి బానిసయ్యాడు. ప్రతిరోజూ మద్యం సేవిస్తూ చుట్టుపక్కల వారితో గొడవ పడుతున్నాడు. పలుమార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 11.30 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఇంటికి వచ్చిన తల్లి విజయ ఎంత పిలిచినా పలకపోవడంతో పెద్ద కొడుకు అంజితో కలిసి తలుపులు బద్దలుకొట్టింది. లోపలికి వెళ్లి చూడగా ఉరేసుకొని కనిపించాడు. సంఘటన స్థలాన్ని తంగళ్లపల్లి ఎస్సై సుధాకర్‌ పరిశీలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అప్పుల బాధతో ఒకరు..


బాలమల్లు (ఫైల్‌)

కూతుళ్ల వివాహాలకు చేసిన అప్పులు తీర్చలేక, బాధతో మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇల్లంతకుంట మండలంలోని పత్తికుంటపల్లెలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం.. గుడిసె బాలమల్లు(58) తన ఇద్దరు కూతుళ్లు రేఖ, అరుణలకు వివాహాలు చేయగా అప్పులపాలయ్యాడు. వాటిని తీర్చే మార్గం లేకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. గత నెల 30న మద్యం సేవించి, భార్య ముత్తవ్వ, కొడుకు అరుణ్‌ను కొట్టడంతో వారు హైదరాబాద్‌ వెళ్లిపోయారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలమల్లు సోమవారం ఉరేసుకున్నాడు. విషయం తెలుసుకున్న అతడి భార్య హైదరాబాద్‌ నుంచి ఇంటికి చేరుకుంది. తన భర్త మరణంపై ఎటువంటి అనుమానం లేదని మంగళవారం ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌ గౌడ్‌ తెలిపారు.

కోనరావుపేటలో సుద్దాలవాసి..


శ్రీకాంత్‌ మృతదేహం

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన పల్లి శ్రీకాంత్‌(32) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీకాంత్‌ మద్యానికి బానిసయ్యాడు. దీనికితోడు కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం మధ్యాహ్నం కోనరావుపేటకు వచ్చి, బస్టాండ్‌ ప్రాంతంలో బస్సుకు అడ్డంగా పడుకొని, ఆత్మహత్యాయత్నం చేయగా ప్రయాణికులు అడ్డుకున్నారు. అక్కడి నుంచి వెళ్లిపోయి, సిరిసిల్లకు వెళ్లే దారిలోని ఓ వ్యవసాయ బావిలో దూకాడు. స్థానికులు కోనరావుపేట పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ఆంజనేయులు సంఘటన స్థలానికి చేరుకొని, ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య మధుషా, కుమారుడు, కూతురు ఉన్నారు.

పైడిపెల్లివాసి..

వెల్గటూర్‌ (ధర్మపురి): అప్పుల బాధతో వెల్గటూర్‌ మండలంలోని పైడిపెల్లికి చెందిన రుద్ర సత్తయ్య(46) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఉమాసాగర్‌ తెలిపారు. వారి వివరాల ప్రకారం.. సత్తయ్య డిష్‌ కాంట్రాక్టు తీసుకొని, ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. నష్టాలు రావడంతో గ్రామంలో అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం కనిపించక పోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం రాత్రి కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేసి, ఆరుబయట నిద్రించాడు. తెల్లవారుజామున ఇంట్లోకి వెళ్లి, ఉరేసుకున్నాడు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.